# రమణీ వీక్షణం

— మల్లిపాతుని రామకృష్ణారావు

చంద్రోదయమవుతూంటే-

వెన్నెల కెరటాలు ఆకాశం నిండా పరచుకుంటున్నాయి.

ఆ డాబా మీద- వేసవి కాలం, వెన్నెల రాత్రి విచ్చుకుంటున్న మల్లె మొగ్గల మధ్య పాల మీగడ లాంటి ప్రక్క మీదున్న కొత్త దంపతుల్ని ముచ్చటగా తిలకిస్తున్నాడు చంద్రుడు కొబ్బరాకుల్లోంచి.

శంకరం మనసు ఆనందంతో పరవళ్లు తొక్కుతోంది. చిక్కని వెన్నెల్ని పులుముకున్న పరిసరాల్ని, ప్రక్కనే కూర్చున్న రమణిని తన్మయంగా చూస్తున్నాడు.

"రమణి లాంటి భార్య లభించడం నిజంగా తన పూర్వ జన్మ సుకృతమే! తను చాలా అదృష్టవంతుడు- సౌందర్యవతి, అన్ని విధాల అనుకూలవతి తనకు అర్ధాంగి కావడం! ఓహ్! రోజులెంత మధురంగా గడుస్తున్నాయి" భార్య జడ కుచ్చుల్ని సుతారంగా సవరిస్తూ అనుకున్నాడు శంకరం.

"మిమ్మల్ని ఓ విషయం అడుగుదామనుకుంటున్నాను మీరే మనుకోరంటే!" భర్త గుండెలపై వాలి అంది రమణి ముద్దుగా.

"ఓ యస్! అడుగు- నీ దగ్గర దాచటానికేముంది?"

"అడగనా? మరోలా అనుకోరు కదా! ప్రామిస్!"

"నిజంగా ప్రామిస్" రమణి చేతిలో చేయి వేశాడు పారవశ్యంతో కళ్లు మూసుకుని.

"ఆవేళ - మా వూరొచ్చారే మా ఇంటికి- పెళ్ళి చూపులకని- ఆ మరుసటి రోజు మిమ్మల్ని మా కాలేజి గేటు దగ్గర చూశానండీ. ఉదయం పది గంటలవుతూంది. మీకు తెలిసినవాళ్లెవరైనా మా కాలేజీలో చదువుతున్నారా?"

ఉలిక్కిపడ్డాడు శంకరం.

"ఎప్పుడూ?" తమాయించుకుని అడిగాడు.

"మీరు, అత్తయ్య, మామయ్య కలిసొచ్చారు కదా... అప్పుడు" ముసి ముసిగా నవ్వుతూ రెట్టించింది రమణి.

"అబ్బే లేదే- ఆ వేళ సాయంత్రం అందరం కలిసి కాకినాడ వెళ్ళిపోయాం..." దబాయించడం అన్ని విధాల మంచిదనిపించింది శంకరానికి ఆ సమయంలో.

"లేదండీ! మిమ్మల్ని ఆ మాత్రం పోల్చలేనా?" అంది రమణి వదలకుండా.

"నా పోలికలతో మీ వూళ్లో వుండొచ్చు కదా!" నసిగాడు గుటకలు మింగుతూ.

"సర్లేండి. నేనే పొరబడి వుంటాను" రాజీపడ్డట్టుగా అంది రమణి.

ఆవేళ జరిగిన సంగతి జ్ఞాపకం వచ్చిన శంకరం నీరుకారిపోయాడు. సడన్‌గా లో వోల్టేజి రావడంతో



కాంతి హీనమైన ఫిలమెంటులా అయిపోయాడు శంకరం.

ఇంతకీ ఆ రోజు ఏం జరిగిందంటే-

రమణి వాళ్ళింటికి వెళ్ళాడు శంకరం తల్లీ దండ్రితో పెళ్ళి చూపులకని. మొదట్నించీ రెండు ఫేమిలీలు తెలిసినవైనా రమణిని చూడ్డం అదే మొదటిసారి శంకరానికి.

"ఒరే! శంకరం! అమ్మాయిని చూశావ్రటా?" తల్లి అడిగింది.

అంతమందిలో రమణిని తదేకంగా చూడాలంటే ఏదోలా అనిపించింది శంకరానికి.

అలవోకగా చూశాడామెను. అంతే! మెరుపు మెరిసినట్టైంది. పరిసరాల్ని మరచిపోయాడు ఆమె సౌందర్యం చూసి! అప్పుడే మెరుగు పెట్టిన బంగారు తీగెలా వుంది.

"భూమ్మీద కూడా అంత అందమైన స్త్రీ లుంటారన్నమాట!" అనుకుంటూ చేష్టలుడిగి ఆమెనే చూస్తూ వుండిపోయాడు.

"అమ్మాయిని హాలులోనికి తీసుకువెళ్లండి"

పేరంటానికి వచ్చినామెవరో అనటంతో సిగ్గు వెంట తరుముతూంటే లోపలికి పరుగెత్తి వెళిపోయింది రమణి.

అలా అన్నామె వంక శమితి మింగేలా చూశాడు.

రమణి మరి కనబడలేదు శంకరానికి.

"అమ్మాయి మా వాడికి నచ్చింది. ఆ విషయం వాడి మొహం చూస్తూనే తెలుస్తుంది. త్వరగా ముహూర్తాలు పెట్టి ఉత్తరం వ్రాయండి" తండ్రి అంటుంటే కూర్చున్నచోటే కలలు కంటున్న శంకరం వాస్తవంలోకొచ్చాడు.

బయటకు వస్తూ అటూ ఇటూ దొంగచూపులు చూశాడు రమణి కన్పిస్తుందేమోనని. ఊహు! ఎక్కడా ఆమె జాడ లేదు.

"మరోసారి ఎలా అయినా రమణిని చూడాలి" ఆలోచిస్తూ బస్టాండ్ కొచ్చాడు.

"అమ్మా! నాకీ వూళ్లో ఓ స్నేహితుడున్నాడే- వాడ్ని చూసొస్తాను- మీరు వెళ్లండి" అబద్దం చెప్పి తల్లీ దండ్రిని బస్సెక్కించాడు.

విజయనగరం రావడం తనకిదే మొదటిసారి వూర్లో తెలిసినవాళ్ళెవరూ లేరు. ఏం చేయాలో తెలియడం లేదతనికి. మరొక్కసారి రమణిని చూడాలనే కోర్కె అతని మనసులో ఉధృతమవుతూంది! ఆమె రూపాన్ని ఊహించుకుంటూ మెయిన్ రోడ్డు మీదకొచ్చాడు.

"పోనీ - తిరిగి వాళ్లింటికి మరోసారి వెళ్తే- ఛీ! ఛీ నవ్వుకుంటారు.... మరెలా?"

"ఆ... గుడ్ ఐడియా!" చిన్నగా విజిల్

కొడ్తూ ఓ లాడ్జిలో రూము తీసుకున్నాడా రాత్రికి.


రమణితో పెళ్ళి, హనీమూన్. ఇలా ఒక్కొక్క దృశ్యాన్ని విడి విడిగా తన వూహల కుంచెతో చిత్రించుకుంటూ గడిపేశాడా రాత్రంతా.

ఉదయాన్నే లేచి ట్రిమ్‌గా మేకప్ చేసుకుని రూము ఖాళీ చేసి రోడ్డు మీదకొచ్చాడు. వాచీ చూశాడు. తొమ్మిదవ్వొరవుతూంది.

ఉమెన్స్ కాలేజీ ఎటుందో అడిగి తెలుసుకున్నాడు. రమణి వుమెన్స్ కాలేజీలో బియస్సీ చదువుతోందని మాటల సందర్భంలో అనుకుంటుండగా విన్నాడు తను.

మెల్లగా నడుచుకుంటూ కాలేజీ దగ్గరకొచ్చే సరికి తొమ్మిది నలభై అయింది. తిన్నగా పోయి కాలేజీ గేటు ముందు నిల్చున్నాడు.

హంసల గుంపులా కదలి వస్తున్నారు కాలేజీ



అమ్మాయిలు. వొయ్యారం కొంచెం కొంచెం దారి పొడవునా వొలకబోస్తూ- తెల్లని యూనిఫాంలో వున్నారంతా.

అమ్మాయిలు ఒక్కొక్కరే అతన్ని దాటుకుంటూ లోపలకు వెళ్తున్నారు.

శంకర్రానికి అయోమయంగా వుంది! అంత మందిలో రమణిని పోల్చటం కష్టంగా వుంది. యూనిఫాంలో అందరూ ఒక్కలానే వున్నారు. కళ్ళు వేగంగా తిప్పుతూ రమణి కోసం చూస్తున్నాడు. ఆమె కన్పించలేదు.

పది గంటలైంది. కోలాహలం తగ్గింది. అందరూ కాలేజీలోకి వెళ్ళిపోయారు.

'రమణీవేళ కాలేజీకి రాలేదేమో! లేక తను సరిగ్గా చూడలేదేమో!'' నిట్టూర్చాడు శ్రమంతా వృధా అయినందుకు.

ఇంతలో-

''ఏయ్! మిస్టర్... పద...'' ఎదురుగా ఇద్దరు కానిస్టేబుల్స్!

తన్ని కాదేమోనని మరోసారి దృష్టి సారించాడు రోడ్డు మీదకు రమణి వస్తుందనే ఆశతో.

''చెప్తుంటే నీక్కాదూ. ఏం ఎరగనట్లు- పద పద'' లాఠీలు గాలిలో వూపుతున్నారు.

ఒక కానిస్టేబుల్ శంకరం రెక్క పుచ్చుకుని ముందుకు తోశాడు.

''ఏంటయ్యా... ఏంటీ దౌర్జన్యం?!'' అడిగాడు బిత్తరపోతూ.

''స్టేషన్లో చెబుతాం పద...'' అక్కడాగి వున్న పోలీస్ వేన్ ఎక్కించారు శంకరాన్ని. ఆ వేన్లో అప్పటికే పది పదిహేను మంది దాకా వున్నారు కుర్రాళ్ళు!

''ఏంటి గురూ? ఏ వూరు మన్ది? కొత్త మొహంలా వుందే!'' అంటూ పగలబడి నవ్వుతున్నారంతా శంకరాన్ని చూడగానే.

పోలీసులు తననెందుకు వేనెక్కించారో కుర్రాళ్ళందరూ. ఎందుకు నవ్వుతున్నారో ఆలోచించే లోగా తిన్నగా పోలీస్ స్టేషన్ ముందాగింది వేన్.

''అందర్నీ సెల్‌లో పడేయండి. రౌడీ వెధవలు పనీ పాటా లేదు- అమ్మాయిల్ని ఏడిపించడం''

భుజాల మీద నక్షత్రాలున్న కాకీ పులొకటి గర్జించింది వీళ్ళను చూసీ చూడగానే.

శంకరానికి ఒంటి నిండా తేళ్ళు, జర్రులు పాకినట్టయింది విషయం అర్థం కాగానే.

''మైగాడ్!'' ఏడుపొచ్చింది శంకరానికి.

''ఈవ్ టీజింగ్ చేస్తున్న వాళ్ళపై పోలీస్ రైడ్ చేశారన్నమాట!''

''సార్! నాదీ వూరు కాదండీ. ఉద్యోగం చేస్తున్నాను- పొరబడి నన్ను తీసుకొచ్చారు'' బిక్క మొహంతో ఇంకా ఏదో చెప్పబోయాడు శంకరం.

''ఏం... మీ వూళ్లో అమ్మాయిల్లేరా అల్లరి పెట్టడానికి. ఈ వూరొచ్చావు. హ్హా.. హ్హా.. హ్హా...'' తారు డబ్బాల్ని లారీల నుంచి క్రిందికి దొర్లించిన చప్పుడు మార్మోగింది ఆ ప్రదేశమంతా. శంకరం గుండెలదిరి గొంతుక్కి అడ్డంగా చిక్కుకున్నట్టనిపించింది!

''అందర్నీ 'లోన' పడేయండి'' హుంకరించాడు నక్షత్రాలున్న కాకీ డ్రస్సాయన.

లాకప్‌లో వేశారందర్నీ.

చలి జ్వరం తగిలినట్లుగా వొణికిపోయాడు శంకరం. ఎప్పుడూ ఇటువంటి దుస్థితి ఎదురవలేదు తనకు. బుద్ధిమంతుడని ఇంటా బయటా తనకో మంచి పేరుంది. చిన్నప్పట్నించీ - అలాంటిది - ఈవేళ.. నవ్వాలో, ఏడవాలో తెలియడం లేదు.

ఓ అరగంట గడిచింది.

''ఇందులో శంకర్రావంట ఎవరు? ఎస్సై గారు రమ్మంటున్నారు'' లాకప్ లోంచి బయటకు తీసుకొని వెళ్ళాడు శంకరాన్ని ఒక కానిస్టేబుల్ వచ్చి.

''ఏ వూరు నీది?''

వణుకుతూ చెప్పాడు. తన పేరూ, ఎడ్రస్ నోట్ చేసుకున్నాడా ఎస్సై.

ఇంకెప్పుడూ ఇట్లాంటి బుద్ధి తక్కువ పన్లు చేయకు... పో''

పొరపాట్న యమభటులు నరకానికి మోసుకుపోతే ప్రాణ భిక్ష పమెట్టిన యమ ధర్మరాజులా కన్పించాడా పోలీసాఫీసర్ శంకరానికి ఆ క్షణంలో.

బ్రతుకు జీవుడా అనుకుని స్టేషన్లోంచి ఒక్క ఉదుటున పైకొచ్చాడు. బస్ స్టాండుకు పరుగు లాంటి నడకతో వెనక్కు మరి తిరిగి చూడకుండా అక్కడ తనూరెళ్ళవలసిన బస్ సిద్ధంగా వుంది. ఎక్కి కూచున్నాడు. అతని గుండెలు భయంతో వణుకుతూనే వున్నాయి బస్ బయల్దేవరకూ.

''ఏంటి దొరగారు సైలంటయిపోయారు?'' రమణి పిలుపుతో వులిక్కి పడి తేరుకున్నాడు.

''ఆ... ఆ... ఏం లేదు...'' మామూలుగా అవటానికి ప్రయత్నిస్తూ అన్నాడు శంకరం.

''ఆవేళ మిమ్మల్ని చూస్తే జాలేసిందండీ. పోలీసులు మిమ్మల్ని వేనెక్కించాక సంగతేంటో తెలిసి వెంటనే ఇంటికి వెళ్ళి డాడీతో చెప్పాను. ఆయనే స్వయంగా వద్దామనుకున్నారు స్టేషన్‌కు. కాని మీరు చిన్నబుచ్చుకుంటారేమోనని ఎస్సైగారికి ఫోన్ చేసి చెప్పారు మీ గురించి...'' విషయం చెప్పేద్దామనుకుని ఆ వెంటనే నాలిక్కరుచుకుంది రమణి.

అది తెలిసి భర్త జుత్తు పీక్కునే ప్రమాదం వుందని, ఫలితంగా ఆ డాబా మీద కురుస్తున్న వెన్నెలంతా ఆ పూటకు దండగవుద్దేమోనని ఆలోచించి శంకరం గుండెల్లో గువ్వలా వొదిగిపోయిందామె.

''చస్తే చెప్పకూడదు రమణికి ఆ వేళ జరిగిన సంగతి'' అనుకున్నాడు శంకరం మనసులో ఆమె మీద కురుస్తున్న వెన్నెల జలతారుకు అడ్డు వస్తూ!